క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం వీఆర్‌కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలోని వెంకటరమణ కాలనీ, గోకుల్ సొసైటీ కార్యాలయం ప్రాంతం, చిన్న చర్చి, జైహింద్ పార్కు ప్రాంతాలు, సాయి హిల్స్, ఘన్‌శ్యామ్ సూపర్‌మార్కెట్ పక్క ప్రాంతంలో ఉదయం 10 నుంచి 1.30గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ ఏ.సత్యవాణి ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా వినాయక్‌పార్కు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వినాయక పార్కు ప్రాంతం, పెద్ద చర్చి ప్రాంతం, స్విమ్మింగ్‌పూల్ మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భాగ్యనగర్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.1.48కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10గంటలకు రామ్‌నరేష్ నగర్ రోడ్డు నం.6 వద్ద, 10.15 గంటలకు సమతనగర్ చిల్డ్రన్స్ పార్కు వద్ద, ఉదయం 10.30 గంటలకు ఆదిత్యనగర్‌కాలనీ రోడ్ నం.1లో, 10.45 గంటలకు హెచ్‌ఎంటీ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

27న రక్తదాన శిబిరం

కూకట్‌పల్లి: ట్వింకిల్ స్టార్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ కేపీహెచ్‌బీ మొదటి ఫేజ్‌లో ఉదయం 9.20 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. రక్తదానం చేసేందుకు యువకులు విచ్చేసి రక్తదానం చేయాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



కూకట్‌పల్లి జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జాతీయ రహదారిపై ఏబీవీపీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పెంచిన ఇంజినీరింగ్ ఫీజులు తగ్గించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ ప్రతీక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ కళాశాలల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు ఏబీవీపీ ఉద్యమాన్ని ఆపే ప్రసక్తి లేదని హెచ్చరించారు.


శుభాకాంక్షలు



ప్రొఫెసర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జేఏసీ నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ విశ్వవిద్యాలయంలో నూతనంగా పదవీ బాధ్యతలను స్వీకరించిన ప్రొఫెసర్ చంద్రమోహన్, డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్, ప్లానింగ్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యూయేషన్, ప్రొఫెసర్ ఎ.అరుణకుమారి, ప్రొఫెసర్ సమ్మూలాల్, ఇంటర్నేషనల్ హాస్టల్ వార్డెన్‌ను మంగళవారం జేఎన్‌టీయూహెచ్ జేఏసీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన వారు యూనివర్సిటీకి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ భిక్షపతి, అధ్యక్షుడు రంజిత్‌కుమార్, వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌నాయక్, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ సందీప్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓటరు బాధ్యతపై వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ డా. అలివేలు మంగమ్మ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు బాధ్యత అనే అంశంపై విద్యార్థులు వ్యాసాలు రాశారు. ఈ పోటీలను కళాశాల తెలుగు విభాగం, మహిళా సాధికారిత విభాగాలు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.భవాని, డాక్టర్ సుజాత, రాఘవేంద్రరావు, ఖాదిరున్నిసా, రాజులు పాల్గొన్నారు. బుధవారం పోస్టర్ మేకింగ్, రంగోలి పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అలివేలు మంగమ్మ తెలిపారు.

బస్సులు లేక పేద, మధ్య తరగతి ప్రజలకు తప్పని తిప్పలు

చివరి బస్టాప్‌కు బస్సులను పునరుద్ధరించండి





అల్విన్‌కాలనీలోని చివరి బస్టాప్‌లో బస్సు కావాలని నిరసన చేస్తున్న కాలనీ వాసులు



ప్రైవేట్ వాహనాలకు పార్కింగ్‌గా మారిన ఆర్టీసీ బస్టాప్

అల్విన్‌కాలనీ: కార్మికులు, కర్షకులు నివసించే ఈ ప్రాంతంలో ఆర్టీసీ బస్సులు లేక ఇతర ప్రైవేట్ వాహనాలు ఆశ్రయించాల్సి వస్తోందని వాటికి పెట్టాల్సిన సొమ్ము లేక కొంతదూరం కాలి నడకన నడవాల్సి వస్తోందని వాపోతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ చివరి బస్టాప్‌లో మూడేళ్ల క్రితం బస్సుల రాకపోకలతో ఆ ప్రాంతమంతా ప్రయాణికుల చేత కిక్కిరిసి పోతుండేది. ప్రస్తుతం కరోనా విళయం నుంచి బస్సులు రాకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు.

◆ ఈ ప్రాంతంలో సుమారు 50 బస్తీ, కాలనీల్లో వేల సంఖ్యలో నివసిస్తున్నారు. ఉదయం 5 నుంచి ప్రజలు తమ రాకపోకలు కొనసాగిస్తుంటారు. గతంలో కార్మికులు ఉదయం వేళ విధుల్లోకి వెళ్లడానికి 4గంటల నుంచే బస్సుల కోసం ఎదురు చూసేవారు. ప్రస్తుతం బస్సులు లేక ఆ ప్రాంతం బోసిపోయింది. బస్సుల పునరుద్ధరణ లేకపోవటంతో ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

గతంలో ఆల్విన్‌కాలనీ చివరి బస్టాప్‌కు వచ్చే బస్సులు, వేళలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

10ఏఎస్	ఆల్విన్‌కాలనీ–సికింద్రాబాద్
185ఎస్	కోఠి–అఫ్జల్‌గంజ్
19	మెహిదీపట్నం
33ఎస్	సికింద్రాబాద్

ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు విరివిగా నడిచేవి.

◆ యాదగిరిగుట్ట, కరీంనగర్, వరంగల్‌లకు వెళ్లేందుకు జిల్లా బస్సులు కూడా నడిచేవి. అవి కూడా ప్రస్తుతం రద్దయ్యాయి. స్థానిక కాలనీ ప్రజలను దృష్టిలో ఉంచుకొని అధికంగా ఈ ప్రాంతంలో నివసించే జిల్లా బస్సులతో పాటు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు వెళ్లే అన్ని బస్సులను వేస్తే ప్రజలు ఆర్టీసీ బస్సులను ఆదరిస్తారని పలువురు పేర్కొంటున్నారు.

బస్టాప్‌లో సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి..



ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోక స్థానిక పేద ప్రజలు ప్రతి రోజు రూ.200 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రధాన ర హదారికి వెళ్లాలంటే రూ.30 ఆటోవారు తీసుకుంటున్నారు. అదే 30 రూపాయలతో సికింద్రాబాద్, కోఠికి ఆర్టీసీలో ప్రయాణించవచ్చు. పేద ప్రజలు బస్సులు లేక విద్యార్థులు ప్రతి రోజు సతమతమవుతున్నారు. గతంలో ఈ కాలనీకి సుమారు 10 బస్సుల వరకు వస్తుండేవి. ప్రజలకు అవగాహన కల్పించి బస్టాప్‌లో సూచిక బోర్డు ఏర్పాటు చేస్తే ఆర్టీసీ బస్సును గతంలో మాదిరే ఆదరిస్తారు.
– శ్రీకాంత్, ఆల్విన్‌కాలనీ

బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి..



ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేక కనీసం కార్మికులు, విద్యార్థులు ప్రయాణించలేక ఇబ్బందులకు గురవుతున్నారు. సామాన్య ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తే అధికంగా రేట్లు ఉండటంతో అద్దెకు కూడా ఈ ప్రాంతానికి రాలేకపోతున్నారు. రాత్రి అయితే ఆటోలు కూడా ఉండటం లేదు. నాలుగు మైళ్లు నడిచి వెళితేనే వాహనాలు దొరుకుతాయి. ప్రజా ప్రతినిధులు గతంలోలాగా ఆల్విన్‌కాలనీ చివరి బస్టాప్‌కు బస్సులొచ్చేలా చర్యలు తీసుకోవాలి.
– కృష్ణమూర్తి, ఆల్విన్‌కాలనీ

అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి



మూసాపేట డివిజన్‌లో సీసీరోడ్డు లేయింగ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మోతీనగర్: ప్రజల అభిప్రాయం మేరకే అభివృద్ధి పనులు చేపడుతున్నామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం పాండురంగానగర్ తోట, పీఆర్‌నగర్ పార్కు దగ్గర, అవంతినగర్ తోట, నాలా దగ్గర, మూసాపేట వార్డు కార్యాలయం దగ్గర సీసీరోడ్డు లేయింగ్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీటి వసతులు కల్పించామన్నారు. ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి పనులు సైతం వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ సీహెచ్. సత్యనారాయణ, వి.ఉదయ్‌కుమార్, మోహన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, తిరుపతిరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు సమస్యలను అధిగమించి ముందుకు సాగాలి



కూకట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న బాలికలు, ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: ఆరోగ్యకర సమాజానికి ఆడపిల్లల చదువు ఎంతో అవసరమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా బడిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి రంగంలో బాలికలు రాణిస్తున్నారని అన్నారు. నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా సమస్యలను అధిగమించి ముందుకు సాగాలన్నారు. ఉద్యోగ, వ్యాపార, సేవా, రాజకీయ రంగాల్లో ఆడపిల్లలకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు.

బీసీల సంక్షేమానికి నిధులు కేటాయించాలని వినతి



బీసీ కమిషన్ సభ్యులకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఓబీసీఎస్‌ఏ ప్రతినిధులు

రాయదుర్గం: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల అభివృద్ధి, సంక్షేమానికి భారీగా నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులకు ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఓబీసీఎస్ఏ) బృందం మంగళవారం వినతిపత్రం అందజేసింది. బీసీ కమిషన్ కార్యాలయంలో వారు అధికారులను కలిశారు. ఈ సందర్భంగా గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ వద్ద ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేసన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.శివకుమార్ మాట్లాడుతూ.. త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలన్నారు. బీసీలకు ప్రత్యేక సబ్సిడీలతో కూడిన సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. బీసీ విద్యార్థులకు హాస్టల్, మెస్ ఫీజు రూ.1,500 నుంచి మూడు వేలకు పెంచాలని, కొత్తగా బీసీ కళాశాలలు, ఇంజనీరింగ్ కాలేజీలు, మహిళలకు ప్రత్యేకంగా కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. బీసీలపై జరుగుతున్న దాడులను నివారించడానికి ప్రత్యేక చట్టం చేయాలని ఆయన అన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మాదాపూర్: అనుమతులు లేకుండా భవనాలు, షెడ్‌లను నిర్మిస్తే ఉపేక్షించేది లేదని చందానగర్ టీపీఎస్ మధు హెచ్చరించారు. మాదాపూర్‌లో మంగళవారం సిబ్బందితో కలిసి అక్రమంగా నిర్మిస్తున్న భవనాల పిల్లర్లను, షెడ్‌లను కూల్చివేశారు. ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే ఆ నిర్మాణాలను కూల్చివేసి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

మహిళలకు సమాన హక్కులు కల్పించడానికి కృషి

పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్య

రంగారెడ్డినగర్: స్త్రీలపై జరుగుతున్న పితృస్వామిక అణచివేత, శ్రమ దోపిడీలపై నాలుగు దశాబ్దాలుగా పీవోడబ్ల్యూ పోరాడుతోందని ఈ సంస్థ జాతీయ కన్వీనర్ సంధ్య అన్నారు. మంగళవారం సూరారం కాలనీ డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌లో జరిగిన పీవోడబ్ల్యూ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల రెండో మహాసభలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలకు పైగా స్త్రీ, పురుష సమానత్వం, అన్ని రంగాలలో సమభాగస్వామ్యంపై పీవోడబ్ల్యూ పోరాడుతోందన్నారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి రాష్ట్రంలో బలమైన మహిళా సంఘంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. మహిళా వ్యతిరేక విధానాలు, మహిళలపై పెరుగుతున్న లైంగిక హింస, సాగుతున్న దాడులను వ్యతిరేకించాలని ఆమె పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో జరిగే మహాసభలకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

◆ ఐఎఫ్‌టీయూ నాయకురాలు అనురాధ మాట్లాడుతూ... మహిళలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక సమానత్వం, నివాస హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బీడీ కార్మికులుగా, గృహ కార్మికులుగా పనిచేస్తున్న మహిళల కోసం ఎన్నో పోరాటాలు చేసి చట్టాలు, హక్కులు సాధించుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ నగర కార్యనిర్వాహణ అధ్యక్షురాలిగా ఎం.సరళ, ఉపాధ్యక్షులుగా జి.పద్మ, భండారువిజయ, ప్రధాన కార్యదర్శిగా జి.భారతి, సహాయ కార్యదర్శిగా వి.జయసుధ, ఎం.అనిత కోశాధికారిగా పుణ్యవతితో పాటు మొత్తం 23 మంది ఎన్నుకున్నారు.

‘కంటి వెలుగు’ దేశానికే ఆదర్శం

కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయంలో జరుగుతున్న కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్‌లను చేస్తారన్నారు. ప్రజలకు అందుబాటులో కాలనీలు, బస్తీల్లోనూ ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా.నీరజ్, డా.విజయ్‌రెడ్డి, సూపర్‌వైజర్ ప్రేమ సుందరి, ఏఎన్‌ఎంలు పద్మ, మంజుల, ఆశావర్కర్లు మౌనిక, వినోద, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

భాగ్యనగర్‌కాలనీ: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణాజిల్లా మచిలీపట్నం జావరపేట గ్రామానికి చెందిన సయ్యద్ ఇబ్రహీం (58) మూసాపేటలో నివాసము ఉంటున్నాడు. ఓ ప్రైవేట్‌ట్రావెల్స్ బస్సులో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని సోమవారం రాత్రి రోడ్డుపై నడచుకుంటూ వెళుతుండగా కూకట్‌పల్లి నుంచి వై జంక్షన్ వైపు అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి జేబులో ఉన్న ఫోన్ ఆధారంగా వారి బంధువులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూలో ప్రశాంత వాతావరణం ఉంది

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, క్యాంపస్ ప్రశాంతంగా ఉందని హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 21న ఎలాంటి అనుమతి లేకుండా ‘ఇండియా: ది మోడీ క్వశ్చన్’ అనే డాక్యుమెంటరీని ప్రదర్శించారు. సమాచారం అందుకున్న భద్రతా బృందం, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ వేదిక వద్దకు చేరుకొని డాక్యుమెంటరీ ప్రదర్శన నిలిపివేయాలని నిర్వాహకులకు సూచించారు. అయితే నిర్వాహకులు అందుకు అంగీకరించకుండా కొంతమంది విద్యార్థుల సమక్షంలో డాక్యుమెంటరీ ప్రదర్శన కొనసాగించారని పేర్కొన్నారు. క్యాంపస్‌లో ఈవెంట్ నిర్వహించాలనుకునే విద్యార్థి సంస్థ డీన్ విద్యార్థుల సంక్షేమం ద్వారా ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమం శాంతియుతంగా ముగిసినప్పటికీ తదుపరి చర్యల కోసం ఈవెంట్‌పై నివేదిక అందజేయాలని విశ్వవిద్యాలయం కోరిందన్నారు.

అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యం



కంటివెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి



పీజేఆర్‌నగర్‌లో కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ వార్డు కార్యాలయంలో కంటి వెలుగు కేంద్రాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. అంధత్వ రహిత తెలంగాణ రాష్ట్రం కోసం ఈ కార్యక్రమం నెల పాటు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉచితంగా కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి కళ్లద్దలు అందజేస్తున్నామని పేర్కొన్నారు.

◆ ఆల్విన్‌కాలనీ: పీజేఆర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సందర్శించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. పరీక్షలకు వచ్చే వారిలో అవసరం ఉన్న వారికి కళ్లద్దాలు అందజేస్తున్నామని అన్నారు. ఉచితంగా మందులు, అవసరమైన వారికి ఆపరేషన్ కూడా చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దొడ్ల రామకృష్ణగౌడ్, డా.మౌనిక, కాశీనాథ్‌యాదవ్, వెంకట్‌నాయక్, ప్రదీప్‌రెడ్డి, పోశెట్టిగౌడ్, వాసుదేవరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూకట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్షా పే చర్చ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి

కూకట్‌పల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ రచించిన ‘ఎగ్జామ్ వారియర్స్’పుస్తకం యువతకు ప్రేరణనిస్తోందని కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాధవరం కాంతరావు పేర్కొన్నారు. అందులో భాగంగా మంగళవారం కూకట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూలులో పరీక్షా పే చర్చ–2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల సమయంలో అనుసరించాల్సిన అంశాలను వివరించారు. ఒత్తిడిని ఏ విధంగా సమర్థవంతంగా ఎదుర్కొంటారనే అంశంపై విద్యార్థుల అభిప్రాయాలను రాత పూర్వకంగా తీసుకున్నారు. ఈ కార్యక్రమాలో అత్యుత్తమ అభిప్రాయాలను పొందుపరిచిన విద్యార్థులకు అభియాన్ సంస్థ ద్వారా హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు.

చెరువుల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



మియాపూర్: నియోజకవర్గంలో చేపట్టిన చెరువుల సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెరువుల సుందరీకరణ, అభివృద్ధి పనులపై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పనిచేసి సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నియోజకవర్గంలో అన్ని చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడా చెరువులు కబ్జాకు గురికాకుండా సర్వే నిర్వహించి కంచే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఎస్ఈ ఆనంద్, ఈఈ నారాయణ, డీఈ నలినీ, ఏఈ పావని, చందానగర్ డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన..

మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీలో రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో సీసీ రోడ్డు పనులు చేపట్టి సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించేందు కు కృషి చేస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నాణ్యత ప్ర మాణాలు పాటించి త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవస్థానంలో రాజగోపుర శిఖర ప్రతిష్ఠ, శ్రీకాల భైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మంత్రపుష్పం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు మాజీ చైర్మన్ నాయినేని సూర్యారావు తెలిపారు. 25వ తేదీన మూలమంత్ర హవనం, ధాన్యాదివాసం, 26వ తేదీన విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలు, మధ్యాహ్నం అన్న సమారాధన వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆలయ అర్చకులు గోపాల్ శర్మ పర్యవేక్షణలో మూడు రోజుల పాటు పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు